News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :135 | ఖమ్మం | బుధవారం, జూన్ 24, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## ఏసీబీ వలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్

- నిజామాబాద్ అధికారిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు

02

## ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

- సీఎంఆర్ గడువునూ పొడిగించాలి
- రైతుల పక్షాన కేంద్ర మంత్రిని కలసిన రాష్ట్ర ప్రతినిధి బృందం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

03



# సర్ సదస్సులతో బీఆర్ఎస్‌లో జోష్

- కేసీఆర్ మార్గదర్శకత్వంలో సభలు
- రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్, హరీష్‌రావు విస్తృత పర్యటనలు
- అవగాహన కార్యక్రమాల పేరుతో కేడర్‌కు భరోసా
- నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి

02





## కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జూన్ 23:**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపన పై చొరవ తీసుకోవాలని

మిగతా 2వ పేజీలో..





# పేరు పెడితే రూ.లక్ష

- లక్ష ఫ్లాట్ల పథకానికి పేర్ల ఆహ్వానం
- ఉత్తమ పేరుకు నగదు బహుమతి
- ఈ నెల 28 వరకు అవకాశం
- హౌసింగ్ బోర్డు వినూత్న పోటీ

**హైదరాబాద్, జూన్ 23:**

తెలంగాణలో అల్పాదాయ వర్గాల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న లక్ష ఫ్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారు చేసేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజల నుంచే పేర్లను

మిగతా 2వ పేజీలో..

## స్వయం సమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

- అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు
- గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయి ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి
- అలసత్వం, నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించబోం
- గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క

02





## ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు మార్గదర్శకాలు

- కలెక్టర్లకు పూర్తి అధికారాలు
- డెప్యుటేషన్ టీచర్లను ప్రస్తుతం రిలీవ్ చేయొద్దు
- విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చర్యలు

**హైదరాబాద్, జూన్ 23:**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు, మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు

మిగతా 3వ పేజీలో..



## టీజీఈసెట్ తొలి విడతలో 59 శాతం సీట్లు భర్తీ

- 8,829 మందికి సీట్ల కేటాయింపు
- జూన్ 27లోపు ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ తప్పనిసరి
- తుది విడత తర్వాత జూలై 10 నుంచి కాలేజీల్లో రిపోర్టింగ్

03

## పద్మ పురస్కారాలతో రాష్ట్రపతి భవన్ కళకళ

- మమ్ముట్టి, విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్
- శిబు సోరెన్‌కు మరణానంతర గౌరవం
- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ

02



## మెట్రోపై సీఎం, కేంద్ర మంత్రి డ్రామాలు

- రేవంత్, కిషన్ రెడ్డి మెట్రో ఆస్తులపై కన్నేశారు..
- రైతుల సమస్యలపై పోరాడితే గృహ నిర్బంధాలా ?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 23:**

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కలిసి రాజకీయ నాటకాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని

మిగతా 3వ పేజీలో..



# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

- ఫేజ్-1 వాల్యుయేషన్. ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్‌గా 'ఎస్‌బీఐక్యాప్స్'
- కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- సమన్వయ సభ్యులుగా కేంద్ర అధికారి, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ
- ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల సంయుక్త సమావేశంలో నిర్ణయం
- కేంద్ర మంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం

**ఢిల్లీ, జూన్ 23 :**

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- 1 వాల్యుయేషన్, ఫేజ్-1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్-2

మిగతా 2వ పేజీలో..



# రేవంత్ పాలనంతా స్కాములే.. స్కీములు లేవు



- అచ్చంపేట నుండి అశ్వరావుపేట వరకు ఒకటే మాట వినిపిస్తుంది
- మాకు మళ్లీ కేసీఆరే రావాలి'..
- ప్రజల ఆకాంక్ష ఇదే
- బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు

02

# పేరు పెడితే రూ.లక్ష

**మొదటిపేజీ తరువాయి**

ఆహ్వానిస్తూ, ఉత్తమమైన పేరును సూచించిన వ్యక్తికి రూ.లక్ష నగదు బహుమతి ప్రకటించింది.

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా క్యూర్ పరిధిలో లక్ష ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు కానున్న ఈ భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో ఈ పోటీ నిర్వహిస్తున్నారు.


తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 28వ తేదీ వరకు ప్రజల నుంచి పేర్ల సూచనలను స్వీకరిస్తారు. వచ్చిన ప్రతిపాదనల్లో ఉత్తమమైన పేరును ఎంపిక చేసి, ఆ పేరును సూచించిన వ్యక్తికి రూ.లక్ష నగదు బహుమతి అందజేయనున్నారు.

**సోషల్ మీడియాలో సూచనలు**

పోటీలో పాల్గొనాలనుకునే వారు హౌసింగ్ శాఖ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా tghd.official ద్వారా తమ సూచనలను పంపవచ్చు. ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది ప్రజలు పాల్గొనేలా సోషల్ మీడియా వేదికను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**త్వరలో పూర్తి వివరాలు**

క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించారు. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ, అర్హతలు, లాటరీ విధానం ద్వారా ఇళ్ల కేటాయింపు వంటి పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. సుదీర్ఘ విరామం తర్వాత చేపడుతున్న ఈ భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టుపై అల్పాదాయ వర్గాల ప్రజల్లో ఆసక్తి నెలకొంది. సొంతింటి కలను సాకారం చేసే ఈ పథకానికి ప్రజలే పేరు పెట్టే అవకాశం కల్పించడం విశేషంగా మారింది.




## పద్మ పురస్కారాలతో
# రాష్ట్రపతి భవన్ కళకళ

**న్యూఢిల్లీ, జూన్ 23:**

దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు.

భారతీయ సినీ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా మలయాళ సినీ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారత టెన్నిస్‌కు విశేష గుర్తింపు తీసుకొచ్చిన విజయ్ అమృత్‌రాజ్‌కు కూడా పద్మభూషణ్ అవార్డు అందజేశారు. వైద్య రంగంలో చేసిన సేవలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని పద్మభూషణ్‌తో సత్కరించారు.

గిరిజనుల హక్కుల కోసం దీర్ఘకాలం పోరాటం చేసిన జేఎంఎం వ్యవస్థాపకుడు శిబు సోరెన్‌కు మరణానంతరం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించారు. ఆయన తరఫున సతీమణి రూపి సోరెన్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.

తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ పురస్కారాలు లభించాయి. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వేడుకలో వారు అవార్డులను అందుకున్నారు. విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా తెలంగాణకు చెందిన శాస్త్రవేత్త చంద్రమౌళికి పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులు, విశిష్ట వ్యక్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

## రేవంత్ పాలనంతా స్కాములే..
# స్కీములు లేవు

**అశ్వారావుపేట జూన్23:**

కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు విమర్శించారు. అశ్వారావుపేటలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

అచ్చంపేట నుంచి అశ్వారావుపేట వరకు ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా వంటి హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతులకు నష్టపరిహారం అందించకపోవడంతో పాటు యూరియా సరఫరాలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు.బీఆర్ఎస్ హయాంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటి పథకాలు అమలు చేశామని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు విడుదల కాకపోవడంతో దళితులు, గిరిజనులు నష్టపోతున్నారని ఆరోపించారు.ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదని, సీతారామ ప్రాజెక్టు పనులు మందగించాయని, అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని అన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలపై స్పందించిన హరీష్ రావు, రైతు బంధు నిధుల అంశంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో
# రాష్ట్ర మంత్రుల భేటీ

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# స్వయం సమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

తీసిపోని మౌలిక వసతులతో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీఆర్డీఓలు, డీపీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ పథకం తదితర విభాగాల అధికారులతో మంత్రి సీతక్క సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏడు గంటలపాటు సాగిన సమావేశంలో శాఖల వారీగా పనుల పురోగతి, భవిష్యత్తు లక్ష్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో సుమారు 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయని గుర్తు చేశారు. ఇంత భారీ యంత్రాంగం, నిధులు ఉన్నప్పటికీ గ్రామాల రూపురేఖలు ఆశించిన స్థాయిలో మారకపోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. 'ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనిచేస్తే ఫలితాలు రావు.. జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు ఒకే టీమ్‌గా పనిచేయాలి.. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి.. ప్రతీ గ్రామానికి అవసరాలు, వనరులు, సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా కార్యాచరణ అమలు చేయాలి' అని ఆదేశించారు. గ్రామాల్లో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగిస్తే గంగదేవిపల్లి వంటి ఆదర్శ గ్రామాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించవచ్చని మంత్రి అన్నారు. వచ్చే రెండు నెలల్లో గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి తీసుకురావాలని అధికారులకు గడువు విధించారు. గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయి ప్రజల ప్రయోజనాలకే ఖర్చు కావాలని స్పష్టం చేసిన మంత్రి ఒక్కో నీటి బొట్టును ఎలా పొదుపుగా వాడుకుంటామో గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయిని కూడా అంతే జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజల డబ్బును వృథా చేయడానికి ఎవరికీ హక్కు లేదు అని అన్నారు. స్థానిక సంస్థల నిధుల వినియోగంపై మాట్లాడుతూ కొన్నిచోట్ల గ్రామ సభలు నిర్వహించకుండా నిధులు ఖర్చు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు నిధుల వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. 'నేను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాను.. జిల్లాల్లో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటాను.. నిర్లక్ష్యం, అలసత్వం, బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు' అని మంత్రి అధికారులను హెచ్చరించారు. సమీక్షలో ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పని దినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులు, అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణాలు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు, పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధన, గ్రామ కార్యదర్శుల హాజరు తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు.

**జల సంరక్షణే భవిష్యత్ భద్రత**

వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. చెరువులు, కుంటలు, బావులు, వాగులను పరిరక్షించడం గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలకమన్నారు. 'చెరువును కాపాడుకుంటే ఊరిని కాపాడుకున్నట్టే.. పాత బావులను గుర్తించి పునరుద్ధరించాలి.. బావుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలను నివారించాలి.. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరిలో ఊట కుంట ఉండేలా చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'జలసిరి' అవగాహన పోస్టర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

**ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు చేరాలి**

వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మిషన్ భగీరథ అధికారులకు మంత్రి సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు సహా ప్రతి ఇంటికీ నిరంతరాయంగా రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మిస్తున్న రహదారులకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతుల సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. 'పట్టణాల్లో స్కైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తుంటే అటవీ గ్రామాల్లో కనీసం బీటీ రోడ్డు వేయడానికీ అనుమతులు రావడం లేదు.. కేంద్రం నిధులు మంజూరు చేసిన తర్వాత కూడా అనుమతుల పేరుతో అడ్డంకులు సృష్టించడం వల్ల ఆదివాసి గిరిజన గ్రామాలు ఇంకా వెనకబాటులోనే ఉన్నాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరగనున్న సమావేశంలో రాష్ట్ర సమస్యలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. పీఎంజీఎస్‌వై కింద అటవీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, కేంద్రంతో సంప్రదింపులు జరిపేందుకు శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

**మహిళా సంఘాలే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక**

మహిళా సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీల పెంపు, మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సెర్ప్ అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళల ఆర్థిక సాధికారత పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సమావేశం ముగింపులో మంత్రి సీతక్క మాట్లాడుతూ 'మనందరిదీ గ్రామీణ నేపథ్యమే.. గ్రామీణ ప్రజల కష్టాలు మనకు తెలుసు.. కాబట్టి గ్రామాల్లో సమస్యలు తలెత్తకముందే పరిష్కారాలు చూపాలి.. తెలంగాణ గ్రామాలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే బాధ్యత మనందరిది' అని అధికారులకు పిలుపునిచ్చారు.

**మెరుగైన పనితీరు కనబరుస్తున్న అధికారులకు సన్మానం**

హోదాను పక్కనపెట్టి మెరుగైన పనితీరును కనబరుస్తున్న అధికారులను మంత్రి సీతక్క శాలువాతో సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కేవలం రెండున్నర నెలల్లో 7.44 కోట్ల పని దినాలు పూర్తి చేసినందుకు సెక్రటరీ దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్‌లను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. జిల్లాస్థాయిలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా రికార్డు స్థాయిలో అమలు చేసినందుకు డీఆర్డీవోలకు స్వీట్ బాక్స్‌లు అందజేశారు. దివ్యాంగులకు యూడిఐడి కార్డులను అందించడంలో కీలక పాత్ర పోషించిన సెర్ప్ డైరెక్టర్ సాయికుమార్‌ను అభినందించి సన్మానించారు.

# సర్ సదస్సులతో బీఆర్ఎస్‌లో జోష్

**హైదరాబాద్, జూన్ 23**

తెలంగాణలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం లేకపోయినా బీఆర్ఎస్ అగ్రనేతలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించే కార్యక్రమాలను పార్టీ సంస్థాగత బలోపేతానికి వినియోగించుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కేటీఆర్, హరీష్‌రావు జిల్లాల వారీగా పర్యటిస్తూ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నేతలతో ముఖాముఖి చర్చలు జరుపుతూ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఏలను నియమించి వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సదస్సుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కూడా నాయకత్వం కీలక సూచనలు చేస్తోంది. తదుపరి ఎన్నికలకు సమయం తగ్గుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో కార్యాచరణ సాగుతున్నట్లు తెలుస్తోంది.



**కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం**

నియోజకవర్గ సమన్వయ సమావేశాల్లో కేటీఆర్, హరీష్‌రావు కార్యకర్తలను ఉత్సాహపరిచే విధంగా ప్రసంగిస్తున్నారు. స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలపై కూడా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఈ సమావేశాలకు కార్యకర్తల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకే రోజులో రెండు లేదా అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తూ నేతలు కేడర్‌తో ప్రత్యక్షంగా మమేకమవుతున్నారు. మాజీ మంత్రులు, ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**కేసీఆర్ మార్గదర్శకత్వంలో కార్యక్రమాలు**

నియోజకవర్గాల వారీగా జరుగుతున్న సమన్వయ సమావేశాలను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏ అంశాలపై దృష్టి పెట్టాలనే విషయాల్లో నాయకత్వానికి సూచనలు అందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సగానికి పైగా నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తవగా, మిగిలిన ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలను విస్తరించాలని పార్టీ యోచిస్తోంది. ఎస్ఐఆర్ అవగాహన సదస్సుల రూపంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలు పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతున్నాయని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి.

## ఏసీబీ వలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్

**హైదరాబాద్, జూన్ 23:**

రాష్ట్రంలో అవినీతి అధికారులపై కొనసాగుతున్న ఏసీబీ దాడుల్లో మరో ఉన్నతాధికారి చిక్కాడు. నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు మంగళవారం విస్తృత సోదాలు నిర్వహించారు. ఉద్యోగ బాధ్యతలను దుర్వినియోగం చేసి అక్రమంగా భారీ ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన సమాచారంతో ఈ దాడులు చేపట్టారు.

**11 ప్రాంతాల్లో సోదాలు**

మల్లారెడ్డిపై అందిన ఫిర్యాదుల ఆధారంగా అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ, ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీలు, అనుచరులకు సంబంధించిన మరో 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. మొత్తం 11 చోట్ల నిర్వహించిన ఈ సోదాల్లో భారీ స్థాయిలో స్థిర, చరాస్తులు వెలుగులోకి వచ్చాయి. ప్రాథమిక విచారణలో నాలుగు నివాస గృహాలు, ఒక వాణిజ్య సముదాయం, ఎనిమిది ఖాళీ స్థలాలు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికార తెలిపారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా 'ఎస్‌బీఐక్యాప్స్'(SBICAPS)ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్ 1 వాల్యుయేషన్, ఫేజ్ 2 విస్తరణ, ఇతర అంశాలపై ఈ సంస్థ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నారు. అధ్యయనం సమయంలో కన్సల్టెంట్ సంస్థతో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి(ఎంఏ అండ్ యూడీ) శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరూ సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు.

**రేవంత్ కోరారు.. కేంద్ర మంత్రులను కలిసాం : 'ఎక్స్'లో కిషన్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో



రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ డియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని 'ఎక్స్'లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## నేతివానపల్లి గ్రామంలో శ్రీ అంజనేయ స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట నిర్మాణానికి 50,000/- రూపాయలను ఇచ్చిన విరాళం...



**సి కె న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి.** జోగులాంబ గద్వాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు విరాళం.తన వంతు సహాయంగా గ్రామానికి వెళ్లి గ్రామ సర్పంచుకు,కమిటీ సభ్యులకు నగదు అందజేత.ఈరోజు గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం నేతివోనిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్మాణానికి 50,000/- రూపాయలను నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు విరాళం ప్రకటించి,తనే స్వయంగా పార్టీ నాయకులతో కలిసి,గ్రామానికి వెళ్లి,గ్రామ సర్పంచుకు,ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. అంతక ముందు,శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామి వారి ఆశీస్సులను పొందారు..

ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు కి గ్రామ సర్పంచు,ఆలయ కమిటీ సభ్యులు,నాయకులు,గ్రామస్తులు శాలువతో ఘనంగా సత్కరించి,ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు పద్మ వెంకటేష్ నాయక్,జనార్ధన్,మాజీ సర్పంచు హనుమంతు,రాజారెడ్డి,శేఖర్ నాయుడు,తిరుమలేష్, చక్రధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,జాంపల్లి భరత్ సింహారెడ్డి,జయ రాములు,నాగేందర్,చిన్న,రజినీ బాబు,పెద్ద ఈరన్న,నరసింహులు, తిమ్మప్ప,అశోక్,పరమేష్,మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.....

## ఊర్ల దేవర మహోత్సవానికి బాసు హనుమంతు నాయుడు గారిని ఆహ్వానించిన గ్రామ నాయకులు



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని బాసు హనుమంతు నాయుడు గారి స్వగృహం నందు ధరూర్ మండలం ఎములోనిపల్లి గ్రామంలో ఈ నెల 24వ తేదీన అనగా రేపు జరిగే లక్ష్మమ్మ,సవరమ్మ ఊర్ల దేవర మహోత్సవానికి హాజరు కావాల్సిందిగా గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు గారిని, గ్రామ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, పూలే బొక్కే ఇచ్చి,శాలువాతో సత్కరించి,ఆహ్వానించారు....

అదే విధంగా,ఊర్ల దేవర మహోత్సవానికి 15,000/- రూపాయలను విరాళం అందజేశారు....

ఈ కార్యక్రమంలో పూడూరు ఈశ్వర్, కురవ పల్లయ్య,శేఖర్ నాయుడు, తిరుమలేష్, శివ, నరేష్,తిమ్మప్ప, కృష్ణ, మోహన్, భీమేష్, ఆంజనేయులు,మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.....

## రైతు వేదికలలో విత్తన మేళా -- రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటే లక్ష్యం:

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి -దీూ=లి

**మిర్యాలగూడ సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటును కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతు వేదికలలో నిర్వహిస్తున్న

ఈ నెల లిలి23 నుండి 30వ తేదీ వరకు నిర్వహించ పడుతున్నామని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు విత్తన మేళాలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు, పప్పు ధాన్యాల విత్తనాలు, సోయాబీన్, కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డి.ఏ.పీ.తదితర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు...రైతులు ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు...మిర్యాలగూడ క్లస్టర్ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పంటలకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు.ఈ కార్యక్రమం




విజయవంతం కావడానికి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారురైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పూజిత ఫర్టిలైజర్ ప్రొప్రైటర్ యాతం శశిధర్ హేమ్లా నాయక్ మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు..


## అంబేద్కర్ నగర్ హత్య నిందితుల అరెస్ట్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 23,** చుంచుపల్లి మండలం అంబేద్కర్ నగర్ గ్రామ పంచాయతీలో ఇనగంటి నాగరాజు హత్య కేసులో నిందితుల అరెస్టు. డి.ఎస్.పి ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం అంబేద్కర్ నగర్ కు చెందిన శివాజీ సన్నాఫ్ శ్రీను అను అతను తన భార్యను అదే గ్రామానికి చెందిన ఇనగంటి నాగరాజు వెంట పడి వేధిస్తున్నాడు అని భర్త కి చెప్పగా 21 జూన్ 2026 న రాత్రి 10 : 20 గంటల సమయంలో సాధన శివాజీ అతని భార్య నాగేశ్వరి అతని చెల్లెలు పరిశుద్ధ అలియాస్ ప్రమీల పథకం ప్రకారంగా నాగరాజుని చంపాలని నిర్ణయించుకొని సాధన శివాజీ భార్య చెల్లెలి ప్రోద్బలంతో అదే రోజు రాత్రి 10 20 గంటల సమయంలో నాగరాజు ఇంటికి వెళ్లి ఇంటిలో పడుకుని ఉన్న నాగరాజుని కత్తితో పొడిచి పారిపోగా మంగళవారం శివాజీ ఇంటికి వచ్చినాడని సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఎం కరుణాకర్ తన సిబ్బందితో శివాజీ ఇంటికి వద్దకు వెళ్లి అరెస్టు చేసి విచారించి అరెస్టు చేసి అతని వద్దనుండి నాగరాజుని పొడిచి చంపిన కత్తినీ అతని ఒంటిపై ఉన్న టీ షర్టును స్వాధీన పరుచుకొని రిమాండ్ చేయటం జరిగిందని కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ మీడియా సమావేశంలో తెలియజేసినారు.

ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ కరుణాకర్,టూ టౌన్ ఎస్ఐ లు రాజ శేఖర్, జీవన్ రాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకు లేఖలు రాస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతి రోజు సాయంత్రం 4:30 గంటల నుండి 5:30 గంటల వరకు 1 గంట సమయం సచివాలయంలో లేదా ప్రజా భవన్‌లో ఉంటానని ఎమ్మెల్యేలకు లేఖలు రాస్తున్న భట్టి విక్రమార్క

## అంగన్వాడి టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలు వేయవద్దసిఐటియు విజ్ఞప్తి

- సిఐటియు జిల్లా నాయకులు షేక్ యాకోబ్ డిమాండ్




**గరిడేపల్లి సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల తహసిల్దార్ స్రవంతి కి అంగన్వాడీ టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలు వేయవద్దని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం ఇవ్వటం జరిగినది ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సిఐటియు జిల్లా నాయకులు ఎస్ కె యాకూబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడి టీచర్లకు బూత్ లెవెల్ సర్ డ్యూటీలు కేటాయించటం వల్ల గర్భిణీల సౌరక్షణ పౌష్టికాహారం వంటి ప్రధాన బాధ్యతలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని యాకూబ్ తెలిపారు పిల్లలకు సేవలు చేయాల్సిన సమయంలో సర్వేలకు వెళ్లడం వల్ల గర్భిణీలకు అత్యవసర సేవలు చాలా ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు అంగన్వాడీ టీచర్లు తీవ్రమైన మానసిక ఒత్తిడికి ఎదుర్కొంటున్నారని తెలిపారు ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థులు స్కూలుకు పోతున్న సమయంలో అంగన్వాడీ సెంటర్లలో పిల్లలు లేకపోతే ప్రభుత్వం సెంటర్లని క్యాన్సల్ చేస్తామని పక్క చెబుతుందని అన్నారు అంగన్వాడి టీచర్లు సరి డ్యూటీలకు వెళ్లే సమయంలో ప్రభుత్వ పాఠశాలలో వాళ్లు అంగన్వాడి స్కూల్ పిల్లలని స్కూలుకు తీసుకుపోతున్నారని అన్నారు దీనివల్ల సెంటర్లలో పిల్లలు లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం సెంటర్లో రద్దు చేస్తుందని గుర్తు చేశారు అయినప్పటికీ ఎంతో కష్టపడి బిఎల్ఓ డ్యూటీలు చేస్తున్న అంగన్వాడీ టీచర్లపై స్థానిక నాయకులు కొంతమంది అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు మధ్యాహ్నం ఒంటి వంటవరకు సర్వేలు చేస్తున్నారని తెలిపారు స్కూల్ టైం లో సర్వే కి వెళ్లడం వల్ల గ్రామాల్లో ప్రజలు అంగన్వాడి టీచర్లు ఉండటం లేదని విజయ చేస్తున్నారని అన్నారు దీని దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీ టీచర్లకు వీలువ డ్యూటీలు వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని సిఐటియు మండల కమిటీ విజ్ఞప్తి ఈ కార్యక్రమంలో దేవా ఆనంద్ నరసింహ ఎల్ సందీప్ బేబీ శ్రీను వెంకటరమణ నాగమణి పాపయ్య నరసింహ వెంకన్న తులసి తదితరులు పాల్గొన్నారు

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్
- పాల్వంచ గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూన్ 23,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గల బాలుర గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పి రోహిత్ రాజు పాఠశాల విద్యార్థుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించి,అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల పరిధిలో మొక్కలు నాటారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక లాంటివారు, క్షణకాలపు ఆనందం కోసం మత్తు పదార్థాల వైపు ఆకర్షితులై, తమ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాల వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేశారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, వైజ్ఞానిక పరిజ్ఞానం పిల్లలకు అవసరమని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని, చదువుల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి నుండి ఉపశమనానికై క్రీడలపై ఆసక్తి చూపాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు.అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని, చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు.ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న



సైబర్ నేరాల గురించి వివరించారు.

విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా జిల్లాలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, అత్యవసర సమయాల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచనలు చేశారు.అనంతర రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు.సుమారు 300మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్. సతీష్ కుమార్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎక్సైజ్ సీఐ ప్రసాద్, పోలీసు అధికారులు,పాఠశాల కళాశాల, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ముక్ర బీ గ్రామంలో తొలకరి వర్షం కురవడంతో రైతులు సంతోషంతో పత్తి విత్తనాలు నాటుతూ ఈ సవచరాం వర్షాలు లేవు ఎలినో ప్రభావం అనటంతో దిగులు చెందినా రైతన్నా రాత్రి కురిసినా వర్షానికి భగవంతుడి దీవెనలు రైతుల పైనా ఉంటాయి అనీ చెంలో పూజలు చేస్తూ భూతల్లి కి కొబ్బరి కాయకోటి ప్రారంభిచారు రైతులు ఏ. ప్రకాశ్ సంతోష్ మధుకర్ ఆనందరావు అన్నారు

## రైతు వేదికలో విత్తన మేళ కార్యక్రమం- ఈ ఏడు సన్న రకాల వరి సాగుకు 500, బోనస్

**జూన్ 23 (సీ కే న్యూస్) చేగుంట** :మంగళవారం నాడు చేగుంట మండల రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం, వ్యవసాయ శాఖ అధికారి హరిప్రసాద్ ఈ కార్యక్రమం నిర్వహించారు,

ఈ విత్తన మేళాలో ప్రధానంగా ప్రభుత్వం సూచించిన క్రింది ఏడు రకాల వరి విత్తనాలను ప్రదర్శించడం జరిగింది.

ఆ రకాలు:

బీపీటీ 5204 (సాంబ మసూరి)
ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా)
కేఎన్ఎం-1638
కేఎన్ఎం-7715
వరంగల్-44 (సిద్ధి)
హెచ్ఎంటీ (హెచ్ఎంటి)
జై శ్రీరామ్ (డబ్ల్యు జి ఎల్-962)

పైన పేర్కొన్న విత్తనాలు ఈ నెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు మండల రైతువేదిక ద్వారా రైతులకు అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు రైతులు ప్రజలు పాల్గొన్నారు.



# అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు ఆదర్శంగా మారతాయి

- గ్రామాలకు వచ్చే ప్రతి రూపాయి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి
- అలసత్వం, నిబంధనల ఉల్లంఘనపై ఉపేక్ష ఉండదు
- స్వయం సమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం
- గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క
- ఏడు గంటల పాటు సాగిన సమావేశం



**సి కె న్యూస్ ప్రతినిది:** గ్రామాల అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, గ్రామాల్లో నివసించే ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే అసలు అభివృద్ధి అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గ్రామాలను స్వయం సమృద్ధిగా, నగరాలకు తీసిపోని మౌలిక వసతులతో తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ పథకం తదితర విభాగాల అధికారులతో మంత్రి సీతక్క సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏడు గంటల పాటు సాగిన సమావేశంలో శాఖల వారీగా పనుల పురోగతి, భవిష్యత్తు లక్ష్యాల ను సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో సుమారు 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయని గుర్తుచేశారు. ఇంత భారీ యంత్రాంగం, నిధులు ఉన్నప్పటికీ గ్రామాల రూపురేఖలు ఆశించిన స్థాయిలో మారకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.

" ఎ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనిచేస్తే ఫలితాలు రావు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు ఒకే టీమ్‌గా పనిచేయాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. ప్రతి గ్రామానికి అవసరాలు, వనరులు, సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా కార్యాచరణ అమలు చేయాలి" అని ఆదేశించారు.

తెలంగాణ గ్రామాల్లో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగిస్తే గంగదేవిపల్లి వంటి ఆదర్శ గ్రామాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించవచ్చని మంత్రి అన్నారు. వచ్చే రెండు నెలల్లో గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి అమలుకు తీసుకురావాలని అధికారులకు గడువు విధించారు.

గ్రామాలకు వచ్చే ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనాలకే ఖర్చు కావాలని స్పష్టం చేసిన మంత్రి, "ఒక్కో నీటి బొట్టును ఎలా పొదుపుగా వాడుకుంటామో, గ్రామాలకు వచ్చే ప్రతి రూపాయిని కూడా అంతే జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజల డబ్బును వృథా చేయడానికి ఎవరికీ హక్కు లేదు" అన్నారు.

స్థానిక సంస్థల నిధుల వినియోగంపై మాట్లాడుతూ, కొన్నిచోట్ల గ్రామసభలు నిర్వహించకుండా నిధులు ఖర్చు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు నిధుల వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు.

"నేను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాను. జిల్లాల్లో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటాను. నిర్లక్ష్యం, అలసత్వం, బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు" అని మంత్రి అధికారులను హెచ్చరించారు.

సమీక్షలో ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులు, అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణాలు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు, పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధన, గ్రామ కార్యదర్శుల హాజరు తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు.

### జల సంరక్షణే భవిష్యత్ భద్రత

వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకొని జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. చెరువులు, కుంటలు, బావులు, వాగులను పరిరక్షించడం గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలకమని అన్నారు.

"చెరువును కాపాడుకుంటే ఊరిని కాపాడుకున్నట్టే. పాత బావులను గుర్తించి పునరుద్ధరించాలి. బావుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలను నివారించాలి. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి ఊరిలో ఊటకుంట ఉండేలా చర్యలు చేపట్టాలి" అని ఆదేశించారు.

ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'జలసిరి' అవగాహన పోస్టర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

### ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు చేరాలి

వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించిన మంత్రి, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు సహా ప్రతి ఇంటికి నిరంతరాయంగా రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మిషన్ భగీరథ నీటి నాణ్యతపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

### ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మిస్తున్న రహదారులకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతుల సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు.

"పట్టణాల్లో స్కైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తుంటే అటవీ గ్రామాల్లో కనీసం బీటీ రోడ్డు వేయడానికీ అనుమతులు రావడం లేదు. కేంద్రం నిధులు మంజూరు చేసిన తర్వాత కూడా అనుమతుల పేరుతో అడ్డంకులు సృష్టించడం వల్ల ఆదివాసి గిరిజన గ్రామాలు ఇంకా వెనకబాటులోనే ఉన్నాయి" అని పేర్కొన్నారు.

ఈ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో జరగనున్న సమావేశంలో రాష్ట్ర సమస్యలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

పి ఎం జి ఎస్ వై కింద అటవీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, కేంద్రంతో సంప్రదింపులు జరిపేందుకు శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు

### మహిళా సంఘాలే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

మహిళా సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీల పెంపు, మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సెర్ప్ అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళల ఆర్థిక సాధికారత పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

సమావేశం ముగింపులో మంత్రి సీతక్క మాట్లాడుతూ, "మనందరిదీ గ్రామీణ నేపథ్యమే. గ్రామీణ ప్రజల కష్టాలు మనకు తెలుసు. కాబట్టి గ్రామాల్లో సమస్యలు తలెత్తకముందే పరిష్కారాలు చూపాలి. తెలంగాణ గ్రామాలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే బాధ్యత మనందరిది" అని అధికారులకు పిలుపునిచ్చారు.

# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి

- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు కు మంత్రులు ఉత్తమ్, తుమ్మల విజ్ఞప్తి
- భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఎయిర్ పోర్ట్

**సి కె న్యూస్ ప్రతినిది:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

మంగళవారం నాడు డిల్లీలో రాశీమోహన్ నాయుడు ను ప్రభుత్వం తరపున మంత్రులు తుమ్మల ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి

గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు.కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే చేసినందుకు రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల, ఉత్తమ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజుబులిటీ సర్వే లో ప్రతిపాదిత స్థలం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేశామని అక్కడ త్వరగా ఫీజుబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల, ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు.

జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు.. హెవీ వాటర్ ప్లాంట్..ఐటీసీ

బీ. పీ.ఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గా నిలిచింది.దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో ఏర్పాటు చేశాం.గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు.



గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బిడ్డన రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల, ఉత్తమ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న "తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం" పోస్టర్‌ను తెలంగాణ ఉద్యమ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పిడమర్తి రవి, డాక్టర్ కె.వి. కృష్ణారావు, నందిగామ రాజ్ కుమార్ జానీ, బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారుల ప్రత్యేక కోటా, అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ మరియు వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమకం గుర్రపు ప్రసాద్

సి.కే న్యూస్ జూన్ 23 మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి






**కమలాకర్:** హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా సోమవారం తెలంగాణ రాష్ట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బొమ్మగాని మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా డి సి సి భవన్ లో ప్రమాణం స్వీకారం గుర్రపు ప్రసాద్ చేశాడు.ఈ పదవికి నన్ను ఎంపిక చేసిన స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, సహకరించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెనుకాల వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా ప్రమాణస్వీకారానికి తరలివచ్చిన మిత్రులు,శ్రేయోభిలాషులు,చిన్న పెద్ద హాజరై నన్ను మీ పెద్ద మనసుతో ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులందరికీ హృదయపూర్వక వందనాలు అన్నారు .

# ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

**తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానూర్ బాబా**



**సి కె న్యూస్ ప్రతినిది యాదాద్రి భువనగిరి**

జిల్లాలోని వివిధ మండలాలో నెలకొన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు.

భువనగిరి పట్టణంలో వందన కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రభుత్వమైనా జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను పరిష్కరించి ఇడ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

జర్నలిస్టులకు సొంత ఇండ్లు లేక అద్దె ఇండల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టి జె ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగరాజు,కదిర్, భువనగిరి మండల కార్యదర్శి అల్తాఫ్,గుండాల అధ్యక్షులు నరేష్, మోత్కూర్ అధ్యక్షులు నర్సింహా, అడ్డగూడూర్ అధ్యక్షులు సందీప్, తుర్కపల్లి కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

# జమ్మిచెడులో 15 మందిపై పిచ్చికుక్క దాడి...

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** గద్వాలలో 15 రోజుల క్రిందట పిచ్చికుక్క దాడి చేసి 20 మందిని గాయపరచిన ఘటన మరువక ముందే మరోసారి పిచ్చికుక్క దాడి



మున్సిపల్ అధికారులు, జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరుతున్న కాలనీవాసులు, మరియు పట్టణ ప్రజలు

జోగులాంబ గద్వాల్ జిల్లా: గద్వాల్ పట్టణం, జమ్మి చెడు లో (4వ, 5వ,వార్డ్ లో ) 15 మంది పై దాడి చేసి కరిచిన పిచ్చి కుక్క. గాయపడిన వారిని మహబూబ్ నగర్, గద్వాల ఆసుపత్రి కి తరలింపు. కుక్కను చంపేందుకు కోసం గాలిస్తున్న కాలనీవాసులు. గద్వాల జిల్లా కేంద్రంలో 15 రోజుల క్రిందట నల్లకుంట, కృష్ణవేణి చౌక్, గంజిపేటలో 20 మందిని పిచ్చికుక్క కరిచిన సంఘటన మరువకముందే మరోసారి ఈ రోజు ఉదయం జమ్మిచెడులో 15 మందిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచిన విషయంలో మున్సిపల్ అధికారులు, జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు కాలనీవాసులు పట్టణ ప్రజలు.

## బాలికల భద్రతే సమాజ భవిష్యత్తుకు భరోసా: డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్



సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా:వనపర్తి జిల్లా షీ టీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), భరోసా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి ఘటనలను సహించరాదని, అటువంటి సందర్భాల్లో వెంటనే షీ టీమ్, మహిళా హెల్ప్ డెస్క్ లేదా జు=ూా-112 సేవలను సంప్రదించాలని సూచించారు.

టీ-సేఫ్ యాప్, షీ టీమ్ సేవలు, మహిళా హెల్ప్ డెస్క్, సైబర్ భద్రతా చర్యలపై వివరించిన ఆయన, వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. అలాగే మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన, సామాజిక దుష్పరిణామాలను వివరించారు.

నేటి బాలికలే రేపటి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, తమ హక్కులు, భద్రతా అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఎస్సై అంజద్, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, కళాశాల అధ్యాపకులు, షీ టీమ్ సిబ్బంది, భరోసా కేంద్రం ప్రతినిధులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

### 3లక్ష రూపాయల ూాజ లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే గారు



సీకే న్యూస్ ప్రతినిధి, ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల మండల ఎర్రపల్లి గ్రామం చెందిన సరిత ఝ/శీ రాముడు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 3లక్ష రూపాయల ూాజ లెటర్ ను లిగద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారి చేతుల మీదుగా అందజేయడం జరిగినది.

### వనపర్తి జిల్లాలో ఓటర్ జాబితా 'మహా శుద్ధి' ూ×= ప్రారంభం



వనపర్తి జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి, స్టాఫ్ రిపోర్టర్

వనపర్తి: జిల్లాలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – ూ×= ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది.

ూ×= ప్రధాన లక్ష్యాలు:
- దూప్లికేట్ ఓటర్ల తొలగింపు
- మరణించిన వారి పేర్లు తొలగింపు
- ఊరు మారిన/అర్హత లేని వారి పేర్లు సవరణ

బూత్ లెవల్ అధికారులు – దీూాలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. ఓటర్లు ఫారం పూర్తి చేసి, అవసరమైన ధృవపత్రాలతో దీూాకి తిరిగి అందజేయాలి.

కొత్తగా 18 ఏళ్లు నిండిన వారు ఫారం-6 ద్వారా, పేరు/చిరునామా/ఇతర వివరాల మార్పులకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లా కలెక్టర్ ఆదేశం:
ఒక్క అర్హత గల ఓటు కూడా జాబితా నుంచి మిస్ కాకూడదు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు తప్పనిసరిగా నమోదు కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ూ×= ప్రక్రియను విజయవంతం చేయడానికి గ్రామ గ్రామాన అవగాహన కల్పించాలని, ప్రజలు దీూాలకు సహకరించాలని విజ్ఞప్తి.

నినాదం: మీ ఓటు – మీ హక్కు. స్వచ్ఛమైన ఎన్నికలకు బాట వేద్దాం.

## డ్రగ్స్ రహిత జోగుళాంబ గద్వాలే మా లక్ష్యం: జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్.,

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల

మత్తుకు 'నో' చెప్పండి.. భవిష్యత్తును బంగారంగా మార్చుకోండి.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల- అనంతపురంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు.



అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతపురం గ్రామశీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్., గారు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక మరియు చట్టపరమైన నష్టాలపై ఆయన విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జోగుళాంబ గద్వాల్ జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా, ముమ్మర తనిఖీలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షణిక ఆనందం కోసం గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలైతే విద్యాభ్యాసం, కెరీర్, కుటుంబ జీవితం పూర్తిగా నాశనమవుతాయని హెచ్చరించారు. సరదాగా మొదలయ్యే చిన్న అలవాటే చివరకు జీవితాన్ని చీకట్లోకి నెట్టేస్తుందన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపించి తీవ్ర ఆందోళనకు గురవుతారని ఎస్పీ తెలిపారు. మత్తుకు బానిసైన వారు సులభంగా నేరాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా డ్రగ్స్ రవాణాకు లేదా విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని, ఇలాంటి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య, విదేశీ ప్రయాణాల వంటి అవకాశాలు పూర్తిగా గల్లంతవుతాయని స్పష్టం చేశారు. పాఠశాలలు, నివాస ప్రాంతాల్లో గంజాయి అమ్మేవారి సమాచారాన్ని వెంటనే డయల్-100కు గానీ, పోలీసులకు గానీ అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.అనంతరం గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమన్న, ఉపాధ్యాయ బృందం, రూరల్ పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ నిత్య వెంకటేష్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్వేర్ ఉద్యోగి దుర్మరణం.



గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు మండల కేంద్రం లో ఉండే అత్తగారింటికి వచ్చి వెళుతుండగా అప్పన్న పేట సమీపంలో గేదె అడ్డంగా రావడంతో ఢీకొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు మృతుడు నవీన్ చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు సాఫ్ట్వేర్ ఉద్యోగి తన విధులు నిర్వహిస్తూ తన వస్తున్న క్రమంలో

గమనించిన స్థానికులు 108 ద్వారా హుజూర్నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు అక్కడ పరిశీలించిన డాక్టర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. ద్విచక్ర వాహనంపై ఉన్న మరో వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు

## రైతు ఆశీర్వాద బహిరంగ సభ సన్నాహక సమావేశం





సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.శ్రీ చెన్నకేశవ మండల సమాఖ్య కార్యాలయంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద మహాసభ సన్నాహక కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివోఏలు, గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లిమత్కేపల్లి వ్యవసాయ మర్కెట్ కమిటి చైర్మన్ అంబటి వెంకటేశ్వరావు పాల్గున్నారు

ఈ సమావేశంలో ూవీజ చైర్మన్ అంబటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలతో నిర్వహించే సోలార్ ప్లాంట్‌లకు ప్రోత్సాహం అందించడం, పెట్రోల్ బంకులు, వ్యాపార రంగాల్లో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించడం జరుగుతోందన్నారు. మహిళలకు రుణ సదుపాయాలు, బీమా సౌకర్యాలు కల్పిస్తూ వారి కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపే కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు లికన్నెబోయిన గోపి మాట్లాడుతూ, మహిళలకు ప్రభుత్వం ప్రతి కార్యక్రమంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని. రాబోయే రోజుల్లో కూడా మహిళల అభ్యున్నతికి మరిన్ని కార్యక్రమాలు ప్రబుత్వం చేపడుతుందని ప్రబుత్వ పథకాలు మహిళలు సద్వినియోగం చేసుకొవాలని కొరారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ సభ్యులు లికొప్పుల గోవిందరావు మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళా సంఘాల కోసం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని, గడపగడపకు వెళ్లి మహిళలను మహాసభకు ఆహ్వానించాలని కోరారు.

ఈ కార్యక్రమాలపై మరింత అవగాహన కల్పించేందుకు, రాబోయే రైతు ఆశీర్వాద మహాసభకు మండలంలోని పొదుపు సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరూ నుంచే సన్నాహక కార్యక్రమాలు ప్రారంభించి సభను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో నాగులవంచ మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం గారు, మధిర నియోజకవర్గ ఇందిరా మహిళా డైరీ ఏపీఎం లక్ష్మణ్ రావు , చింతకాని మండల ఏపీఎం నాగపుల్లారావు , సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## గార్లపాడు గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరైన....

**- తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య(౧+ూ+ణజఖీూ) చైర్ పర్సన్ సరితతిరుపతయ్య గారు..**



సికే న్యూస్ ప్రతినిధి గద్వాల :ధరూర్ మండలం గార్లపాడు గ్రామం సర్పంచ్ పరిమల శివరాజ్ ఆహ్వానంమేరకు శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ నెలపూజ మరియు పోలమ్మ అవ్వ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ కు ముఖ్య అతిధిగా హాజరైన.. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య(౧+ూ+ణజఖీూ) చైర్ పర్సన్ సరితతిరుపతయ్య గారు... శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ మరియు పోలమ్మ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు గార్లపాడు గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేసి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవం లో పాల్గొన్నారు..

వారితో పాటు.. గార్లపాడు సర్పంచ్ పరిమల శివరాజ్ గారు, అదిమల్లారెడ్డి గారు, పటేల్ శ్రీనివాస్, గుడ్డెందొడ్డి సర్పంచ్ పద్మావతి నర్సింహులు, పెద్దపల్లి సర్పంచ్ శిరీష పెద్దపల్లి రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ గౌడ్, తోటరాముడు, మల్లేష్, ఆంజనేయులు, పోస్ట్ వెంకటరెడ్డి, నాగేందర్, ప్రహల్లద్, రాధాకృష్ణ, జంగిలప్ప, వినోద్, ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు...

## ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) పై దీూా లకు ప్రత్యేక శిక్షణ సదస్సు నిర్వహించిన....

- తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య (౧+ూ+ణజఖీూ) చైర్ పర్సన్, గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య గారు...
- జోగులాంబ గద్వాల జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ రాజీవ్ రెడ్డి గారు...
- ఓబీసీ కోఆర్డినేటర్ శ్రీ కేతూరి వెంకటేష్ గారు..



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాంప్రసాద్ బ్యాన్కెట్ హాల్‌లో గద్వాల పట్టణం మరియు గద్వాల మండలం, ధరూర్, కె.టి.దొడ్డి, గట్టు, మల్దకల్ మండలాలకు చెందిన దీూా లకు ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ సదస్సు ఘనంగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో దీూా ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా సమగ్రంగా పని చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సెల్ సభ్యులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, తాలూకా మరియు మండల స్థాయి సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులుమడిపల్లి రాంప్రసాద్.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.మండల పరిధిలో రేపల్లెవాడ గ్రామంలో ఆడపు వీరయ్య రమాదేవి దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకులు మడిపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఇంటి కలకు సహకరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రామారావు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, చేపల చెరువు సొసైటీ అధ్యక్షుడు మాసిపోయిన రామారావు వేశాల రంగయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# యూరియా కోసం యాప్ అవసరం లేదు ప్రభుత్వము యాప్ ను రద్దు చేయాలి .

**యాప్ ద్వారా రైతులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు.**

**పాత పద్ధతి ద్వారానే యూరియా సరఫరా చేయాలి.**

**టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం సంగం గ్రామం.**

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 23.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం.

మండల పరిధిలోని సంఘం గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం మీడియాతో మాట్లాడుతూ.

వలిగొండ మండల పరిధిలోని కొన్ని ప్రాంతాలలో యూరియా ఒక్క బస్తా 320 రూపాయల నుండి 500 రూపాయలకు కూడా అమ్ముతున్నారు.

ఆన్లైన్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునే పద్ధతిని ప్రభుత్వం విరమించుకోవాలి దీని ద్వారా పెద్ద రైతులు ఖాతాలో ఉన్న వారికి మాత్రమే యూరియా అందుబాటులో ఉంటుంది.

మిగతా చిన్న రైతులు యాప్ డౌన్లోడ్ కాక యూరియా దొరకక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. కొన్ని మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో ఫెర్టిలైజర్స్ షాపులో అధిక ధరలకు యూరియా విక్రయాలు జరుగుతున్నాయి. మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఫెర్టిలైజర్స్ షాపుల పైన ఉండాలని మీడియా ద్వారా టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం తెలిపినారు.



# ఫెర్టిలైజర్స్ షాపులపైన అగ్రికల్చర్ అధికారుల పర్యవేక్షణ లేదు.



**టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం సంగం గ్రామం.**

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 23.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం.

మండల పరిధిలోని సంఘం గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం మీడియాతో మాట్లాడుతూ.

వలిగొండ మండల పరిధిలోని కొన్ని ప్రాంతాలలో యూరియా ఒక్క బస్తా 320 రూపాయల నుండి 500 రూపాయల వరకు కూడా అమ్ముతున్నారు.

ఆన్లైన్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునే పద్ధతిని ప్రభుత్వం విరమించుకోవాలి దీని ద్వారా పెద్ద రైతులు ఖాతాలో ఉన్న వారికి మాత్రమే యూరియా అందుబాటులో ఉంటుంది.

మిగతా చిన్న రైతులు యాప్ డౌన్లోడ్ కాక యూరియా దొరకక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. కొన్ని మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో ఫెర్టిలైజర్స్ షాపులో అధిక ధరలకు యూరియా విక్రయాలు జరుగుతున్నాయి. మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఫెర్టిలైజర్స్ షాపుల పైన ఉండాలని మీడియా ద్వారా టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం తెలిపినారు.

## గ్రామపంచాయతీ కార్యదర్శిగా నూతనంగా వచ్చిన తండా బాలరాజు గౌడ్ గారిని కలిసిన వికలాంగ హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా కోకన్వీనర్ లోడి ధనంజయ గౌడ్



**సి కె న్యూస్ ఆత్మకూరు యం రిపోర్టర్ షేక్ అజీజ్** పల్లెర్ల గ్రామ కార్యదర్శిగా నూతనంగా వచ్చినటువంటి తండ బాలరాజు గౌడ్ సార్ గారిని వికలాంగుల హక్కుల పోరాట సమితియాదాద్రి భువనగిరి జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ గౌడ్ గారు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది

## సిలివేరి శ్రీనును పర్యమర్శించిన

**తిమ్మినేనిపాలెం బిఆర్ఎస్ నాయకులు వార్డ్ మెంబర్ మీరాసాహెబ్ దంపతులు**



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** ఇటీవల పనిచేస్తూ ప్రమాదానికి గురై మోకాలికి తీవ్రమైన గాయమై ఖమ్మంలోని రెయిన్బో హాస్పటల్లో మోకాలు సర్జరీ చేయడం జరిగింది అది తెలుసుకొని తనను పర్యమర్శించి తన యోగక్షేమాలు తెలుసుకోవడం జరిగింది

# అపోహలు వీడి నమ్మకం ఉంచండి... అసాధ్యాన్ని సుశాధ్యం చేస్తాం...




**సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా 'శ్రీనివాస్ బొట్ల...**

**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, సి కె న్యూస్** మలక్పేట యశోద హాస్పిటల్ యాజమాన్యం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వెన్నెముక శస్త్రచికిత్స అనగానే పక్షవాతం వస్తుందని లేదా జీవితాంతం మంచాన పడాల్సి వస్తుందనే భయాలు, అపోహలు చాలామందిలో ఉన్నాయి. కానీ నేటి ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ అపోహలన్నీ పటాపంచలవుతున్నాయని మలక్పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు నిరూపించారు. తీవ్రమైన వెన్నెముక నరాల నొక్కుడు సమస్యతో కదలలేని స్థితికి చేరుకున్న ఒక రోగికి విజయవంతంగా శస్త్రచికిత్సను పూర్తి చేసి, ఆమెకు మళ్లీ నడిచే భాగ్యాన్ని కల్పించారు. హైదరాబాద్కు చెందిన ఏలేటి విమల (53) గత కొంతకాలంగా తీవ్రమైన నడుము నొప్పి, కుడి కాలికి పాకే నొప్పి, రెండు కాళ్లలో తిమ్మిర్లు, మొద్దుబారడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కనీసం నడవలేని స్థితిలో ఆమె మలక్పేట్ యశోదా ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన అయస్కాంత ప్రతిధ్వని ఇమేజింగ్ (ఎమ్మార్ఐ) పరీక్షల్లో ఆమెకు వెన్నెముకలోని బహుళ స్థాయిలలో నడుము భాగపు నరాల మార్గం ఇరుకుగా మారడం, వెన్నెముక పూసల మధ్య ఉండే మెత్తటి డిస్క్ జరగడం వల్ల నరాలపై తీవ్ర ఒత్తిడి పెరిగినట్లు గుర్తించారు. దీనివల్ల కాళ్లకు రక్తం, నరాల ప్రసరణ తగ్గి రోజువారీ పనులు కూడా క్లిష్టంగా మారాయి. యశోదా ఆసుపత్రి సీనియర్ వెన్నెముక, నాడీ శస్త్రచికిత్స నిపుణులు డా. శ్రీనివాస్ బొట్లఆధ్వర్యంలో రోగికి గత మే నెలలో స్పృహ తప్పించే మందు ఇచ్చి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. వెన్నెముక పూసల స్థాయిలలో ప్రత్యేక స్క్రూలు, గట్టి టైటానియం రాడ్లను అమర్చి వెన్నెముకను కదలకుండా స్థిరపరిచారు. వెన్నెముక వెనుక ఎముక భాగాన్ని కొద్దిగా తొలగించి, నరాల మూలాలపై ఉన్న ఒత్తిడిని పూర్తిగా తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి యాంటీబయాటిక్స్, శారీరక వ్యాయామ చికిత్స (ఫిజియోథెరపీ) నిపుణుల పర్యవేక్షణలో నడక శిక్షణ ప్రత్యేక పునరావాస సేవలు అందించారు. ప్రస్తుతం రోగి తీవ్రమైన నడుము నొప్పి, కాలి నొప్పి నుండి పూర్తి ఉపశమనం పొందారు. కాళ్లలో తిమ్మిర్లు తగ్గి, ఎటువంటి సాయం లేకుండా పూర్తి స్వతంత్రంగా నడవగలుగుతున్నారు. ఎటువంటి శస్త్రచికిత్సానంతర సమస్యలు లేకుండా స్థిరమైన ఆరోగ్యంతో ఆమె ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు.

వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకుంటే మంచానికే పరిమితం కావాల్సి వస్తుందనేది కేవలం అపోహ మాత్రమే. బహుళ స్థాయిల్లో నరాలపై ఒత్తిడి అధికంగా ఉన్నప్పుడు ఒత్తిడిని తొలగించే, స్థిరపరిచే శస్త్రచికిత్సలు అద్భుతమైన ఫలితాలు ఇస్తాయి. ఈ కేసులో సాధించిన విజయమే అందుకు నిదర్శనం. కాలం చెల్లిన నమ్మకాలను పక్కనబెట్టి, సకాలంలో సరైన వైద్య నిర్ణయం తీసుకుంటే వెన్నెముక సమస్యల నుంచి సంపూర్ణ విముక్తి సాధ్యం అన్నారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం కావడంపై యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి , అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ చిదురు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక నాడీ శస్త్రచికిత్స ఆపరేషన్ థియేటర్లు, నిరంతర నిఘా వ్యవస్థలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం వల్లే ఇలాంటి క్లిష్టమైన కేసుల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నామని, రోగులను తిరిగి సాధారణ జీవితానికి చేరువ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# వెంపాడు టోల్ ప్లాజా వద్ద భారీగా గంజాయి పట్టివేత

- నక్కపల్లి పోలీసుల అదుపులో నలుగురు నిందితుల అరెస్టు
- కోటి 32 లక్షల విలువచేసే 264 కేజీల గంజాయి స్వాధీనం






**నక్కపల్లి, సి కె న్యూస్ జూన్ 23:** అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, వేంపాడు టోల్ ప్లాజా వద్ద భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది. ఈగల్ టీమ్ నుండి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వెంపాడు జంక్షన్ సమీపంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించిన నక్కపల్లి పోలీస్ బృందం రెండు కార్లలో తరలిస్తున్న రూ. కోటి 32 లక్షలు విలువగల 264 కేజీల గంజాయిని సోమవారం సాయంత్ర సమయంలో చాకచక్యంగా పట్టుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నక్కపల్లి పోలీస్ స్టేషన్ లో నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తేధి 22.06.2026న సుమారు 6 గంటల సమయంలో హైదరాబాద్ నుండి అద్దెకు తీసుకొచ్చిన ఇన్నోవా కారు తో పాటు పైలట్ వాహనం (ఎర్టిగా కారు)ను వెంపాడు జంక్షన్ సమీపంలో పోలీసులు అడ్డగించారు.

ఇన్నోవా కారులో ఉన్న కవటి సాయి తేజ (హైదరాబాద్ నివాసి, వృత్తి: డ్రైవర్) సచిన్ గెహ్లాట్ (మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినవాడు, ప్రస్తుతం హైదరాబాద్లో నివసిస్తూ కిరాణా దుకాణంలో పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. ఎర్టిగా కారులో ఉన్నవారు సోమేష్ (కేరళ రాష్ట్రానికి చెందినవాడు, ప్రస్తుతం హైదరాబాద్లో నివసిస్తున్నాడు) మరియు రాజబాబు (రోలుగుంట నివాసి, ఎర్టిగా కారు యజమాని మరియు డ్రైవర్)గా గుర్తించారు.

తనిఖీ సమయంలో 264 కిలోల గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ మత్తు పదార్థాన్ని ఎన్ డి పి ఎస్ చట్టం నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

విచారణలో, రవాణా నెట్వర్క్లో వెనుక లింక్గా మలసాల మోహన్ అలియాస్ వెంకట్ అలియాస్ పరమేశ్ (రోలుగుంట నివాసి) ముందరి లింక్గా సలీమ్(మంగలోర్) మరియు షాజహాన్ (కేరళలో) నివసిస్తూ, ఈ గంజాయి స్వీకరించాల్సిన వారు) గుర్తించబడ్డారు.

ఏ 1-- సోమేష్, కేరళ ప్రస్తుతం హైదరాబాద్లో నివసిస్తున్నాడు.

ఏ 2-- కవటి సాయి తేజ, హైదరాబాద్ నివాసి, వృత్తి: కారు డ్రైవర్.

ఏ 3--సచిన్ గెహ్లాట్, మధ్యప్రదేశ్ ప్రస్తుతం హైదరాబాద్లో నివసిస్తున్నాడు, వృత్తి: కిరాణా దుకాణ కార్మికుడు.

ఏ 4-- రాజబాబు, అనకాపల్లి జిల్లా రోలుగుంట ఎర్టిగా కారు యజమాని మరియు డ్రైవర్. 264 కిలోల గంజాయి, ప్రభుత్వ విలువ నిర్ధారణ మెమో ప్రకారం సుమారు రూ. 1,32,00,000/-(అక్షరముల ఒక కోటి ముప్పై రెండు లక్షలు) విలువైనది. నిందితుల వెల్లడింపు ప్రకారం, ఈ గంజాయిని సుమారు కిలోకు రూ. 10,000/- చొప్పున కొనుగోలు చేసినట్లు, మొత్తం కొనుగోలు విలువ సుమారు రూ. 26,40,000/-(ఇరవై ఆరు లక్షల నలభై వేలు రూపాయలు) గా ఉందని

ఒక టయోటా ఇన్నోవా కారు( ఈ ఇరవై నాలుగు లక్షలు),ఒక మారుతి సుజుకి ఎర్టిగా కారు.( పదమూడు లక్షలు), ఐదు మొబైల్ ఫోన్లు


సీజ్ చేయబడిన మొత్తం విలువ రూ. 1,69,00,000లు గా నిర్ధారించడమైనది అన్నారు. మలసాల మోహన్ అలియాస్ వెంకట్ అలియాస్ పరమేశ్, రోలుగుంట నివాసి, చోడవరం పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైం నెం. 125/2016లోని గత ఎన్ డి పి ఎస్ కేసులో నిందితుడు. సోమేష్, కేరళ నివాసి, కేరళలోని తిరునెల్లి పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైం నెం. 33/2015లోని గత ఎన్ డి పి ఎస్ కేసులో నిందితుడుగా ఉన్నారు. గంజాయి పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన నక్కపల్లి సిఐ జై మురళి, ఎస్సై సన్నీ బాబు పోలీస్ సిబ్బందిని నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు అభినందించారు.

## తాసిల్దార్ వేణుగోపాల్ ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి ఎస్సీ సెల్ నేతలు



**సి కె న్యూస్** పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు నూతనంగా తాసిల్దార్ బాధ్యతలు తీసుకున్న వేణుగోపాల్ ను తెలుగుదేశం పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండ వీరయ్య , తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి , 33 వ వార్డు ప్రెసిడెంట్ మూకిరి సతీష్ , ప్రధాన కార్యదర్శి కొండెపాటి రమేష్ బాబు , దార్లసుబ్బారావు , ఐ టి డి పి బొంత వేణు పాల్గొన్నారు.

# మళ్లీ.. బాహుబలి!




ప్రపంచవ్యాప్తంగా ఇండియన్ సినిమా స్టామినాని చాటిచెప్పిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి మరో క్రేజీ ప్రాజెక్ట్ ముస్తాబవుతోంది. ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులకు ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' అనే కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను పంచుకుంటూ డార్లింగ్ ఫ్యాన్స్‌ను ఖుషీ చేశారు. ఈ పోస్టర్‌లో ప్రభాస్ యానిమేషన్ అవతార్‌లో యోధుడిలా కనిపిస్తూ గూస్‌బంప్స్ తెప్పిస్తున్నారు. ఫ్రాన్స్‌లోని అన్నెసీ వేదికగా జరిగే ప్రతిష్టాత్మక 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'కి ఈ ప్రాజెక్ట్ ఎంపికైంది. ఇక్కడ జరిగే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్స్‌లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'ను ప్రదర్శించబోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ప్రభాస్ పంచుకోవడంతో అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. పోస్ట్ పెట్టిన కొద్ది నిమిషాల్లోనే లక్షకు పైగా లైక్స్, వేలాది కామెంట్స్ రావడం విశేషం. ఆర్కా మీడియా వర్క్స్ నిర్మాణంలో వస్తున్న ఈ భారీ యానిమేషన్ చిత్రానికి అగ్ర దర్శకుడు రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇషాన్ శుక్లా ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. "బాహుబలి ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్.. అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా ఒక అద్భుతాన్ని సృష్టిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా? అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అంటూ ప్రభాస్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. బాహుబలి సిరీస్ సినిమాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ కాంబో, ఇప్పుడు యానిమేషన్ రూపంలోనూ గ్లోబల్ లెవెల్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ కొత్త అవతార్ ప్రేక్షకులను అలరించడం ఖాయంగా కనిపిస్తోంది.

## హాట్ స్టార్!




ప్రజ్ఞా నాగ్రా



## అన్‌ఫాలో చేసేసింది?

గత కొంతకాలంగా తమిళ స్టార్ హీరో విజయ్ మరియు స్టార్ హీరోయిన్ త్రిషల రిలేషన్‌షిప్ గురించి సోషల్ మీడియాలో రకరకాల రూమర్స్ చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. అయితే, తాజాగా వీరిద్దరూ బ్రేకప్ చెప్పుకున్నారనే ప్రచారం కోలీవుడ్ వర్గాల్లో జోరందుకుంది. దీనికి బలమైన కారణం జూన్ 22న జరిగిన విజయ్ పుట్టినరోజు వేడుకలే. విజయ్ రాజకీయాల్లోకి వచ్చి, ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత వచ్చిన తొలి పుట్టినరోజు కావడంతో అభిమానులతోపాటు సినీ, రాజకీయ ప్రముఖులనుంచి పెద్దఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ప్రతి సంవత్సరం విజయ్ పుట్టినరోజున త్రిష అందరికంటే ప్రత్యేకంగా స్పందించేది. ఆయనతో కలిసి దిగిన అరుదైన, పర్సనల్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ విషెస్ చెప్పడం ఆమెకు ఒక అలవాటుగా వస్తోంది. కానీ, ఈ ఏడాది విజయ్ బర్త్‌డే రోజున త్రిషనుంచి ఎలాంటి పోస్ట్ రాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ట్రెండ్ అవుతున్న ఈ బర్త్‌డే వేడుకల వేళ ఆమె పూర్తిగా మౌనం వహించడంతో ఇద్దరి మధ్య ఏదో జరిగిందనే అనుమానాలు బలపడ్డాయి. అంతేగాక, కేవలం శుభాకాంక్షలు చెప్పకపోవడమే కాకుండా, త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో విజయ్‌ను అన్‌ఫాలో చేయడం నెట్టింట సంచలనంగా మారింది. ఇన్నాళ్లూ వీరి రిలేషన్‌పై వచ్చిన వార్తలను లైట్ తీసుకున్న నెటిజన్లు, ఇప్పుడు ఈ అన్‌ఫాలో వ్యవహారంతో వీరిద్దరూ విడిపోయారనే ప్రచారానికి ఇది పక్కా నిదర్శనమని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## కొత్త రిలీజ్ డేట్‌తో 'ప్యారడైజ్'



బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ "ది ప్యారడైజ్" . మొదట మార్చి, తర్వాత ఆగస్టు అనుకున్నప్పటికీ.. తాజా ఇండస్ట్రీ టాక్ ప్రకారం చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా బడ్జెట్ అనుకున్న దానికంటే పెరిగినప్పటికీ, చిత్ర కంటెంట్ మరియు క్వాలిటీపై నిర్మాతలు పూర్తి నమ్మకంతో ఉన్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై పాన్-ఇండియా లెవెల్లో ఈ చిత్రం భారీ స్థాయిలో రూపొందుతోంది. ఈ చిత్రంలో మోహన్ బాబు, కాయాదు లోహర్, రాఘవ్ జుయల్, బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ళ భరణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.



## రణబాలి.. డేట్ మారిందా?


టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న అవైటెడ్ భారీ సినిమానే రణబాలి. ముచ్చటగా మూడోసారి చేస్తున్న ఈ సినిమాని దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తెరకెక్కిస్తున్నాడు. భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దీనిని ప్లాన్ చేస్తుండగా మేకర్స్ ఈ సినిమాని ఆల్రెడీ సెప్టెంబర్ 11 విడుదలకి లాక్ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఇప్పుడు సినీ వర్గాల్లో టాక్ ప్రకారం రణబాలి ఈ డేట్‌నుంచి వెనక్కి వెళుతున్నట్టు తెలుస్తోంది. ఇక కొత్త డేట్‌గా అక్టోబర్‌లో డేట్ ఫిక్స్ కానున్నట్టు ఇండస్ట్రీ టాక్. సో, రణబాలి విషయంలో ఓ ఫైనల్ క్లారిటీ ఇంకా బయటకు రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి ఆదిపురుష్ సంగీత దర్శకులు అజయ్, అతుల్‌లు సంగీతం అందిస్తున్నారు. అలాగే మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా లెవెల్లో నిర్మాణం వహిస్తున్నారు.

## నయన్.. యాక్షన్..



షారుక్ ఖాన్ 'జవాన' సినిమాతో హిందీలోకి తొలి అడుగు వేసింది నటి నయనతార. అందులో ఆమె యాక్షన్ ప్రాధాన్యమున్న పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తను సల్మాన్ ఖాన్ చిత్రంతో మరోసారి హిందీ ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈసారి కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా యాక్షన్‌తోనూ అదరగొట్టనుందని సమాచారం. ఇటీవలే ఈ సినిమాకి సంబంధించిన కీలక షెడ్యూల్ని పూర్తి చేయగా.. నయన్‌పై కొన్ని పోరాట సన్నివేశాల్ని చిత్రీకరించినట్ట తెలిసింది. భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ముస్తాబవుతున్న సినిమాని వంశీ పైడిపల్లి తెరకెక్కిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇది వచ్చే ఏడాది రంజాన్‌కి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది. దక్షిణ భారత సినీ పరిశ్రమలో 'లేడీ సూపర్‌స్టార్'గా సుస్థిర స్థానం సంపాదించుకున్న నయనతార.. బాలీవుడ్‌లో కూడా తన ప్రత్యేక గుర్తింపు నిలుపుకుంటోంది. వరుసగా రెండు పెద్ద హిందీ చిత్రాల్లో కీలక పాత్రలు పోషించడం ఆమె పరిధిని మరింత విస్తరిస్తోంది. నయన్ తాజా లుక్‌లు, యాక్షన్ సీక్వెన్సులు సోషల్ మీడియాలో ఇప్పటికే తీవ్ర సంచలనం రేపుతున్నాయి. సల్మాన్-నయన్ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మేజిక్ చేస్తుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఎంట్రీవరకే.. వారసత్వం!




సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ మన కష్టాన్ని చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు.

"నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్నకంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడంవల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.

మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటనపరంగా ఫీడ్ బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలుపట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి" అని చెప్పారు.

ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. "థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. జపాన్‌లో కూడా సోషల్ మీడియా బజ్ వల్లే రూ.65 కోట్లకు పైగా వసూళ్లు వచ్చాయి. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం" అని చరణ్ వ్యాఖ్యానించారు.